కథ

# విరహమెంత మధురం

ముచ్చర్ల రజనీశకుంతల

''నింగి నుంచి దూకినట్టు, నేల నుంచి పైకి ఎగిరినట్టు.... గాలితో కలిపి నడుస్తున్నట్టు... అప్పుడప్పుడు చేతులు చాచి పలకరించే వారిని, చల్లదనంతో చుట్టు ముట్టేస్తున్నట్టు... మార్నింగ్‌వాకులూ, జాగింగులూ, రన్నింగులూ.... అందమైన ప్రకృతిలో డేటింగులూ... వాహ్.... ఆ దృశ్యాన్ని ఏ అదృశ్యరూపంలోనో రతీ, మన్మధులు చూస్తే.... విరహమే ఉష్ణ మండలమై ఆవిరై పోదూ... కలయికే అనుభవాల వర్షమై, శృంగారాన్ని నిలువెల్లా తడిసి వెళ్ళిపోదూ... ఆ అనుభూతి ధన్యమైతే.... ఈ విరహమెంత మధురమో.... కదూ....''

★★★

కోయంబత్తూర్....

ఎయిర్‌పోర్ట్....

వెల్ కమ్ టు కొడైకెనాల్... అన్న ప్లకార్డుతో క్లబ్ మహేంద్ర రిప్రజెంటేటివ్.

ఆశ్చర్యంలో నుంచి అనుభవం లోకి నడిచొచ్చినట్లు... అదృశ్యంలో నుంచి దృశ్యాన్ని చూసినట్టు... పెళ్ళినాటి సప్తపదిని ఇష్టపదిగా మార్చుకొని అతని చిటికెన వేలును అపురూపంగా పట్టుకొని నడుస్తోంది మధువని.

***

వగలుపోయే నగర సుందరి అందాన్ని ఆస్వాదించి, వయ్యారాలతో మెరిసిపోయే పల్లె సొగసుల నయగారాన్ని వీక్షిస్తూ రిలాక్సవుతున్నారు విరించి, మధువని.

***

అంతా కలలా వుంది.

కలే నిజమైనట్టుంది.

కలే వరమైనట్టుంది.

అందమైన అమ్మాయి పొడవాటి జడలా వున్న నల్లటి తారు రోడ్డు మీద, కారు చెలికాడి చుంబన యాత్రలా మెరుపు వేగంతో వెళ్తోంది.

సాయం సమయం...

మబ్బులన్నీ ఒక్కటై.... ముప్పిరిగొన్న ఆనందాన్ని చల్లదనంతో పంచుకుంటూ, ప్రకృతి శరీరాన్ని అందమైన చీరలా చుట్టుకున్నట్టు... నేలకు–నింగికి మధ్య వేలాడుతూ, గెంతులాడుతూ కదులుతూ వెళ్తుంటే...

మధువని భర్తకు దగ్గరగా జరిగింది. వర్షానికి ముందు వచ్చే ఇష్టమైన మట్టివాసన... కారు స్పీడుగా వెళ్తుంటే, మబ్బులు మనల్ని తాకి వెళ్తోన్న ఫీలింగ్... చుట్టూ పచ్చని చెట్లు, కొండలు... కారులో మంచి మెలోడి సాంగ్స్.... విరించికి ఓ అలవాటు. ఏ టూర్‌కి వెళ్ళినా అతనికిష్టమైన మంచి మంచి సాంగ్స్ సిడిని దగ్గర ఉంచుకుంటాడు. ఆ సాంగ్స్ వింటూ, అందమైన ప్రకృతిని చూస్తూ ప్రయాణించడం, మధ్యలో ఆకలేసినప్పుడు దిగి దాబా దగ్గర లంచ్, డిన్నర్‌లు చేయడం చాలా ఇష్టం.

ఈసారి కూడా అలాగే మెలోడి సాంగ్స్ వున్న సి.డి. ప్లే చేసాడు.

అలాంటి జర్నీ అంటే మధువనికి కూడా చాలా ఇష్టం. దాదాపు ఇద్దరి యిష్టాలు ఒక్కటే. అప్పుడప్పుడు చిన్నచిన్న తేడాలున్నా, ఒకరి కోసం ఒకరు త్యాగాలు చేసుకుంటారు. అది మొక్కుబడిగా వుండదు. ఎంతో యిష్టంగా వుంటుంది.

అప్రయత్నంగా తలను భర్త భుజం మీద వాల్చింది... సె.... క్యూ.... ర్డ్... ఫీలింగ్. ఈ క్షణమే ప్రపంచం గ్లోబల్ వార్మింగ్‌తో తునాతునకలైనా చలించనివ్వని ఫీలింగ్.

ఇదేమిటి... ఈ అద్భుతమైన కానుకేమిటి... ఈ కొడైకెనాల్ ట్రిప్ ఏమిటి..?

విరించి మధువని నడుం చుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కొన్నాడు. ఒక్క క్షణం అలానే భర్తని అల్లుకు పోవాలనిపించింది.

ఈ మనిషేమిటి? నిన్నటివరకూ తననెంత ఏడిపించాడు. భర్త మీద అందమైన కోపం? ఒక్క క్షణం ఆమె మనసు రివర్స్ గేర్‌లో వెనక్కి వెళ్ళింది.

***

విరించి బోర్డర్ సెక్యూర్టీ ఫోర్స్‌లో ఆఫీసర్. అతనికి తన వృత్తి ప్రాణం. సరిహద్దులో శత్రుదేశం తాలూకు గాలిని కూడా చొరబడనివ్వని సాహసి. పెళ్ళయిన మూడో రోజే, మూడు రాత్రుల ముచ్చట ఇంకా పూర్తవ్వకుండానే 'యమర్జన్సీ ఆపరేషన్' వల్ల హుటాహుటిన వెళ్ళాడు.

విరించి గురించి అంతా తెలిసే పెళ్ళి చేసుకుంది. పెళ్ళి చూపుల్లో ఒకే ఒక ప్రశ్న అడిగిన విరించి అంటే బోల్డు యిష్టపడి పెళ్ళికి తలూపింది.

''నా బలహీనతలను నాకన్నా ఎక్కువగా ప్రేమించగలవా?'' విరించి అడిగిన ఒకే ఒక ప్రశ్న.

''ఎంత గొప్ప ప్రశ్న...'' అది ఆమె హృదయాన్ని స్పృశించింది. కట్నం ప్రసక్తి లేకుండా, ఆడంబరాలను కాదని సింపుల్‌గా రిజిస్ట్రార్ ఆఫీస్‌లో పెళ్ళి చేసుకున్నారు.

విరించికి దేవుడి పట్ల నమ్మకం లేదు. మధువనికి దేవుడంటే భక్తి. కానీ తన పతి దేవుడి కన్నా, పైన వున్న కనిపించని దేవుడు గొప్పకాదని, నిజంగా గొప్పే అయినా, తన దేవుడ్ని ప్రేమించొద్దని, ఆ దేవుడు అనడని మధువని గాఢ నమ్మకం.

***

సంవత్సరంలో ఏ నెలో, పదిహేనురోజులో విరించి సాన్నిహిత్యం లభించేది మధువనికి. అది చాలు... మిగిలిన సంవత్సరం లోని 'లేమి' రోజుల్ని భర్తీ చేసుకోవడానికి. భర్త సాన్నిహిత్యంలో ఒక్కో అనుభవం శతకోటి అనుభవాల సమానం... అనుభూతి సంవత్సర పర్యంతం ఆమెను హంట్

చేస్తూనే వుంటుంది.

***

విరించి పదిహేన్రోజుల సెలవుమీద వచ్చాడు. భర్తకోసం ఎన్నో రోజులు... గంటలు... వేనవేల నిమిషాలు... లక్షల క్షణాలు ఎదుర్చూసి... చూసి.... తల వాకిట కాపు కాసి, అభిసారికలా ఎదుర్చూస్తోంటే భర్త వచ్చాడని తెలియగానే తండ్రి వచ్చాడు... తమ ఇంటికి ఆహ్వానించాడు.

ఒకే ఊళ్లో వున్నా తండ్రి దగ్గరకి వెళ్లదు. అక్కడికివెళ్తే విరించి జ్ఞాపకాలు దూరమవు తాయని... ఆమె ఫీలింగ్... అలాంటిది విరించి ఆమె తండ్రి కోరికను మన్నించి అక్కడికి వెళ్లాడు.

విరహం తాలూకు కోరికకన్నా.. ఇష్టం తాలూకు కాంక్ష భర్త సాన్నిహిత్యాన్ని కోరుకుంటూ వుంటే... రాత్రంతా అల్లుడితో ముచ్చట్లాడే తండ్రిని చూసి మండింది... కనీసం అవతల అందమైన పెళ్ళాం ఎదుర్చూస్తోందని, ఎన్నో అనుభవాలను దొంతరగా చేసి, దోసిలిలో పోసి, కౌగిలిలో కట్టి, స్పర్శతో ధారపోస్తుందని మరిచిన మొగుడ్ని చూస్తోంటే, మంట నశాళానికి ఎక్కింది. అలా రెండ్రోజులు గడిచాయో, లేదో... అక్కయ్య వాళ్ళు.... బాబాయ్ వాళ్ళు... బామ్మ వాళ్ళు... అతని తరపు వాళ్ళు... తన తరపు వాళ్ళు... విందుల పేరుతో, ఆతిథ్యం పేరుతో, అడ్డమైన పేర్లతో అనుభవాలతో, నఖ. దంత, చుంబన క్షతాలతో గడపాల్సిన ఎన్నో రాత్రులు చీకటి చాటున ముసుగు తన్నేసాయి...

ఒకటి...

రెండు...

మూడు... అలా... అలా... తొమ్మిదిరోజులు గడిచాయి... నా పాలిట శనిగ్రహాల్లో 'నవగ్రహాల్లా... తొమ్మిది రోజులు... నవ రాత్రులూ నాకు శివరాత్రులే... మిగిలినవి ఆర్రోజులు... నా మొగుడి బర్త్‌డే ఆరు.... కీ ఇన్సిడెంట్... నా పాలిట రొమాంటిక్ యాక్సిడెంట్... నిట్టూర్చింది.

అట్లా, తొమ్మిది రోజులు గడిచేక, పదో రోజు... అర్జంటని చెప్పి ఏర్‌పోర్ట్‌కు తీసుకువచ్చి... ఫ్లైట్ ఎక్కించేక... అంతా కలలా కనిపించేక, ఇలా కొడై కెనాల్‌లో..

***


ఎక్కడో మట్టివాసన...

ఎక్కడో నల్లటి మబ్బు... తెల్లటి మబ్బుతో ప్రేమ కబుర్లు చెప్పుకుంటోంది. చలిగాలి... చెలికాడితో సరసమాడుతున్నట్లు... ఆ అందమైన సాయంత్రం వర్షంతో కుమ్మక్కయింది.

మధువని కారు దిగింది... చుట్టూ ఘాట్‌రోడ్డు... దూరంగా మారుతీలు.... టాటా సుమోలు, వీడియో కోచ్‌లు వెళ్తోంటే అందంగా ఉంది.

అప్పుడప్పుడు మబ్బులు వాటిని కప్పేస్తున్నాయి. ఎంతో ఆహ్లాదంగా వుంది. దేవుడు ఎంత అందమైన ప్రకృతిని సృష్టించాడు! ఇంత అందమైన దృశ్యాల్ని కెమెరాలో బంధించక పోతే ఎలా...! అనుకుంటూ బ్యాగ్‌లో నుండి వీడియో కెమెరా తీసి షూట్ చేయసాగింది. విరించి దూరంగా నిలబడి నవ్వుతూ మధువనినే చూస్తున్నాడు.

ఓ మేఘం ఆమెని తాకి, భయంగానో బిడియంగానో.... ఇష్టంగానో చూసి ఝల్లుమనేలా చేసింది.



చిన్నప్పటి మేఘాలు గుర్తొచ్చాయి. మేఘం అంటే ఏంటి... ఒట్టి పొగే... ఒట్టి ఆవిరే... సూర్యరశ్మితో సంగమించి... గాలితో పయనించి, ఎప్పుడో చలించి... వర్షించే... చినుకుల జానా, మేఘాలు బారుల్లో వెళ్తున్నాయి. అవి టీనేజ్ అమ్మాయిల్లా అందంగా కనిపిస్తున్నాయి.

''ఏమండీ ఆ మేఘాన్ని అందుకోవా?'' ఎగిరెగిరి చేత్తో మేఘాన్ని అందుకోవాలన్న తాపత్రయం... ఆమె ఎగురుతోన్నప్పుడు ఆమె నడుమందం, నగిషీలు చెక్కినట్టు అనిపిస్తూ, కనిపిస్తోంటే, రెండు చేతులతో ఆమె నడుముని పట్టుకొని పైకి లేపాడు.

ఎప్పుడో, అరకు వెళ్ళినప్పుడు.... మామిడికాయల కోసం, తను తన భార్యను ఎత్తుకున్న దృశ్యం గుర్తొచ్చింది. ఇప్పుడు మబ్బులను తుంచి, తన నెత్తిన వర్షపు తలంబ్రాలు పోయించుకోవాలనుకుంటోంది.

ఆ మబ్బు బెట్టు చేయలేదు. వాళ్ళిద్దరి తలల మీదుగా వెళ్తూ 'శతమానం భవంతి... శతాయుష్మాన్భవ....' అని ఆశీర్వదించి వెళ్ళింది.

***

స్టుడియో...

విశాలమైన హాలు....

అందమైన బెడ్‌రూమ్... ముచ్చటేసే కిచెన్... ఎక్కడ్నుంచి చూసినా తన మొగుడు కనిపిస్తాడు. స్టుడియో నుంచి చూస్తోంటే కొడైకెనాల్ అందాలు మురిపిస్తున్నాయి.

***

''చ....లి....'' వణుకుతూ అంది మధువని.

చలికి చలే విరుగుడు... అతడు ఆమె చలిని బ్లాంకెట్‌తో కాంపెన్సేట్ చేయదల్చుకోలేదు. అసలు బెడ్‌రూమ్‌లో భార్య ఒంటిమీద అచ్ఛాదనలు చూస్తే అతడికి ఎలర్జీ. ఆ మాటకొస్తే ఆమెకూ అంతే.

అచ్ఛాదనలు... అనాచ్ఛాదనగా మారినవేళ... ఆ స్టుడియోలో ఆమె అవచ్ఛాదిత దేహం వేనవేల బల్బుల కాంతివంతమై... మెరిసిపోతుండగా, అతను చుంబన దండయాత్ర ఆమె పాదాల నుంచి మొదలెట్టాడు.

ఆమె పాదాల్లో కూర్గ్ అందాలు... ఆమె జఘనంలో మున్నార్ బ్యూటీ... ఆమె నడుంలో కొడైకెనాల్ సౌందర్యం... ఆమె హృదయ భాగమ్మీద కాశ్మీర్ సోయగం... ఆమె పెదవుల్లో సిమ్లా ప్రేమ; కళ్ళల్లో నయినీతాల్ కైపు.... అన్నీ కనిపిస్తున్నాయి.

హీటర్ల అవసరం లేని ఆ స్టుడియో వీళ్ళ రొమాంచిత శృంగారాన్ని చూసి ఒక్క క్షణం సిగ్గుతో తల వాల్చింది.

ఆ ఆర్రోజులూ...

అరవై సంవత్సరాల అనుభవాలతో... అనుభూతులతో గడిచిపోయాయి. కొడైకెనాల్ లోని వాటర్ ఫాల్స్, సూసయిడ్ స్పాట్, లేక్... మబ్బుల అల్లరి... రోజులో ఇరవై నాలుగు గంటలూ చల్లదనం... వర్షం తాలూకూ అందం... ఇవేవీ ఆమె చూడలేదు. భర్త సాన్నిహిత్యంలో, కౌగిలిలో అన్నింటినీ వీక్షించింది.

శతకోటి రాత్రుల సమానం.... ఈ ఆర్రోజులూ

***



బ్యాక్ టు హైదరాబాద్.

కోయంబత్తూర్‌కి వెళ్ళేదారిలో పళనిలో ఆగి రోప్‌వేలో సుబ్రహ్మణ్య స్వామి టెంపుల్‌కి వెళ్ళారు. అభిషేకం చేయించి వెనుదిరిగారు.

కోయంబత్తూర్‌లో భార్య కోసం యాభైవేల రంగులతో వున్న చీరను చెన్నయ్ సిల్క్స్‌లో కొన్నాడు.

అంతా బాగానేవుంది. దేనికీ లోటులేదు. మధువని మనసులోనే చిన్న డౌట్ పీకుతోంది.

''కొంచెం కోపం ... ఇంకొంచెం అనుమానంగా వుంది'' అంది మధువని.

''నువ్వడిగేది ఆ తొమ్మిదిరోజుల గురించేగా! నేను వచ్చీరాగానే నీతో పాటు గడిపాననుకో... గొప్ప ఫ్లేవర్ మిస్సయ్యే దానివి... చేదు తిన్నాక స్వీట్ బావుంటుందా? స్వీట్ తిన్నాక చేదు బావుంటుందా...

తొమ్మిదిరోజులు వాళ్ళకోసం.. ఈ ఆర్రోజులు నీ కోసం... నువ్వు నాతో గడిపిన చివరి ఆరు రోజులే... నీకు మళ్ళీ నేను వచ్చే వరకూ గుర్తుండాలనే అలా చేసాను. ఇప్పుడు వాళ్ళు హేపీ... మనం హేపీ... మళ్ళీ నేను వచ్చేవరకూ ఈ విరహమెంత మధురం... అనుకోవాలి...'' ఆమె కళ్ళలో చిప్పిల్లిన కన్నీళ్ళను తన పెదవులతో తుడుస్తూ అన్నాడు. భర్త గుండెల మీద తల పెట్టింది. తన భర్తలాంటి వాళ్ళు ఈ ప్రపంచంలో వుంటారా?

***

అవును... వాళ్ళ విరహమెంత మధురం? ఈసారి వచ్చినప్పుడు విరించి తన మధువనిని ఎక్కడికి తీసుకు వెళ్ళగలడో మీరు గెస్ చేయగలరా? మరి మీ సంగతో..

*

ముచ్చర్ల రజనీ శకుంతల,
సెల్: 92462 02616